# అపశ్రుతులు

అరుణాచలం



సురేష్ పార్వతీశం గారి మూడవ కొడుకు. మిగతా ఇద్దరు కొడుకులు చదువులు పూర్తి చేసి మంచి ఉద్యోగంలో చేరారు. పార్వతీశం వస్తుత: ఆస్తిపరుడే గాక, మంచి హోదా,జీతం గల ఉద్యోగం చేస్తున్నాడు. చివరి వాడు కావటం వల్ల ఇతనిని తల్లి సుశీల, తండ్రి పార్వతీశం అతి గారాబంగా పెంచారు. అతను కోరింది కోరినట్లు ఇయ్యటానికి అభ్యంతరం ఎప్పుడూ ఆ తల్లిదండ్రులు చెప్పలేదు. అలా చెప్పాల్సిన అవసరం కూడా వారికి లేదు. స్కూటరు కావాలంటే స్కూటరు కొనిచ్చారు. అతను కారు కావాలంటే, తండ్రివేరేఏర్పాటు చేసుకొనికారు ఇస్తాడు. పెద్ద నగరంలో జీవించటం—హోదా గల తండ్రి—పుష్కలంగా డబ్బు ఉండడం వలన సురేష్ ఎప్పుడూ పై లాపచ్చీసుగా ఉంటాడు. అయినా తల్లిదండ్రు లంటే గౌరవంగా ఉంటాడు. ఎప్పుడూ తల్లి తండ్రులను ఎదిరించిన సందర్భంలేదు. కనక తల్లి దండ్రులు అతనిని చూసి మురిసిపోతూ ఉంటారు. అతను ఎక్కడ తిరుగుతున్నాడని వాకబు చేయటం గాని, అతనిపై ఆంక్షలు విధించటం గాని వాళ్ళు ఎరుగరు. ఆ వాతావరణంలో పెరుగుతున్న ఆ ఇరవై ఏళ్ళ యువకునికి కష్టంఅంటే ఏమిటో తెలియాల్సిన అవసరమూ లేదు. వాటిని గురించిన ఆలోచన చెయ్యాల్సిన అవసరం గాని ఎక్కడుంటుంది? తల్లిదండ్రుల ప్రోద్బలం వల్ల నయితేనేమి, పరిస్థితుల ప్రభావం వల్ల నయితే నేమి, అతను వాళ్ళ అంతస్థుకు తగ్గ వాళ్ళతోనే పరిచయాలు ఏర్పరచుకొన్నాడు. స్థితిమంతుల పిల్ల లందరి లాగానే అతను ఉన్నాడు. ఫలితంగా అతను కూడా చాలా చిన్న పరిధి లోనే పరిభ్రమిస్తున్నాడు.

సురేష్ బి. ఏ. పూర్తిచేసి, ఎం. ఎ. లో చేరాడు. ఎం. ఎ. పూర్తిచేసిన తరవాత పెద్ద ఉద్యోగంలో చేరటం ఖాయం అని అతని నమ్మకం. తన అన్నల స్థితి, ప్రస్తుతం తండ్రికి ఉన్న హోదా ఆ నమ్మకానికి బల మిచ్చాయి. ఈ రెండేళ్ళు కాలేజీకి వెళితే, తను పాసయిపోయినట్లే నని కూడా అతని దృఢ విశ్వాసం.

కాలేజీకి వెళ్ళటం, సాయంత్రం ఇంటికి వచ్చి టిఫిన్ తినటం, తరవాత స్నేహితులతో షికారుకో, లేకపోతే సినిమాకో పోవటమో అతని దిన చర్యలో భాగాలు. టిఫిన్ తిని మళ్ళీ బయటకు వెళ్ళాలని హడావుడిగా ఇంట్లోకి వచ్చిన సురేష్, కొత్తవాళ్ళెవరో ఉండటంతో, తలొంచుకొని నెమ్మదిగా లోపలకు పోతున్నాడు. తల్లి పిలిచి, అతన్ని ఆ కొత్త వాళ్ళకు పరిచయం చేసింది.

రేఖ వయస్సు, ఇరవై రెండో లేక ఇరవైమూడేళ్ళు ఉండచ్చు. పక్కనే ఉన్న పాప ఆమె కూతురై ఉండాలి అనుకున్నాడు సురేష్. ప్రతి నమస్కారం చేసి లోపలికి వెళ్ళాడు.

రేఖ తరుచుగా వీళ్ళ ఇంటికి వస్తున్నది. ఆమె కూతురు తెల్లగా,బొద్దుగా ఉండి చాలా ముద్దొస్తూ ఉంటుంది. ఆ పాపనుచూడగానే ఎత్తుకొని ముద్దాడుతాడు సురేష్. బజారు తీసుకెళ్ళి చాకలెట్లు అవి కొని పెడతాడు. అలా రేఖ ఎక్కువగా వీళ్ళింటికి రావడంతో సురేష్ ఎక్కడికి పోకుండా ఆ పాపతో ఆడుకుంటూ ఉండేవాడు.

రేఖ వెళ్ళిన తరవాత ఆమెను గురించిన వివరాలు తల్లి నడిగాడు. ఆ దగ్గర్లోనే వాళ్ళ ఇల్లు ఉందని, ఈ మధ్యనే అక్కడకు అద్దెకు వచ్చారని, బాగా డబ్బున్న వాళ్ళని చెప్పింది. ఆమెకు ఒక పాపని, తల్లి తండ్రులు కూడ ఆమెతోనే ఉంటారని తల్లి చెప్పింది.

ఇలా వాళ్ళింటికి రావడమే కాక రేఖ, సురేష్‌కు చాలా తడవలు కనిపించేది. ప్రతి తడవ ఆమెను పలకరించటం, పాపతో ఆడుకోవడం జరుగుతూనే ఉంది.

ఆమెకూడా అతనితో చాలా చనువుగా మాట్లాడేది. ఏ వో కబుర్లు చెబుతూనే ఉండేది.

సురేష్ చాలా కలుపుగోలు కుర్రవాడనీ, కల్లాకపటం లేనివాడనీ ఆమె అభిప్రాయపడ్డది. ఆప్యాయత, అంతఃకరణ ఉన్నవాడని కూడా అనిపించింది. పై ఆదివారం మంచి డాన్సు ప్రోగ్రాం ఉందని, వాళ్ళ వాళ్ళంతా వస్తున్నారని చెప్పి, ఆమెను కూడ రమ్మని ఆహ్వానించాడు. మొదట్లో కొంచెం తటపటాయించినా అతని బలవంతంమీద చివరకు ఒప్పుకుంది.

అందరూ కలిసి ఆ డాన్సు ప్రోగ్రామ్‌కు వెళ్ళినప్పటినుంచి వాళ్ళు సన్నిహితం అవుతున్నారు. సుశీల కూడ రేఖను సాదరంగా పిలిచేది. మధ్య మధ్య భోజనాలక్కూడా ఉండమని బలవంతం చేస్తే ఆమె ఉండేది. ఎప్పుడూ తనే వాళ్ళింటికి వస్తున్నానని, వాళ్ళెప్పుడు తమ ఇంటికి రాలేదని నిష్ఠూరంగా మాట్లాడటంతో సురేష్, వాళ్ళమ్మ కూడ రేఖ వాళ్ళింటికి వెళ్ళారు. ఆమె తల్లి తండ్రులతో కూడ పరిచయం ఏర్పడ్డది. ఇలా ఒకళ్ళింటికి ఇంకొకరి రాకపోకలు కొనసాగుతున్నాయి. ఎప్పుడు వెళ్ళినా ఆ అమ్మాయి తల్లి తండ్రులు తప్ప, భర్త కనిపించలేదు. సుశీలకు అతనిని గురించి రేఖను అడిగింది. కాని ఎక్కడో ఉన్నట్లుగా చెప్పింది కాని, ఏ సంగతి స్పష్టంగా తెలియలేదు. ఇంకా తరచి తరచి అడిగితే బాగుండదని ఈమె పూరుకున్నది. ఇదే అనుమానం సురేష్‌కు కూడ వచ్చింది.

అతను ఒక రోజు ఈ విషయం ఆమెను అడిగాడు. ఆమె ముఖకవళికలు మారాయి. కాని ఆమె సమాధానం చెప్పలేదు. ఆ ప్రశ్నకు ఆమె ఎందుకు నొచ్చుకుందో ఇతనికి అర్థం కాలేదు.

ఒకరోజున పబ్లిక్‌గార్డెన్‌లో తిరుగుతున్న సురేష్‌కు రేఖ కనిపించింది. లాన్స్‌లో పరధ్యాన్నంగా కూర్చొని ఉంది. దగ్గరకు వెళ్ళి రెండు తడవల పిలిచినా పలకలేదు. బహుశః ఏదో ఆలోచిస్తూ కూర్చుందనుకొన్నాడు. అతనికి ఒక అనుమానం కూడ వచ్చింది, ఆమె రచయిత్రి ఏమోనని—అందుకే ఏకాంతంగా కూర్చొని ఏదో ఆలోచిస్తుందని అనుకొన్నాడు.

"ఏమండీ ! మీరు కథలు అవి రాస్తారా?" అని అడిగాడు.

"మీ కా అనుమానం ఎందుకు వచ్చింది" అని ఎదురు ప్రశ్న వేసింది. తను అనుకున్నది చెప్పాడు. ఆమె ఫక్కున నవ్వింది.

"పరధ్యాన్నంగా ఉండటమే రచనలకు ముఖ్యమయితే, అందరూ రచయితలే అయ్యేవారు" అంది వ్యంగ్యంగా.

"అలాంటిదేమీ లేదు, నా స్వభావమే అంత" అంది తర్వాత అనునయంగా.

ఇలా తరచు వాళ్ళు కలుస్తూనే ఉన్నారు. సురేష్‌కు ఆమె పట్ల ఆసక్తి పెరిగింది. ఆమె అంత పరధ్యాన్నంగా ఎందుకుంటుంది అన్న ప్రశ్నకు ఎంతకీ అతనికి సమాధానం దొరకలేదు. పైగా భర్తను గురించి అడిగినప్పుడు చాలా బాధ పడిందన్న విషయం ఆమె మొహమే చెప్పింది. ఏవో కష్టాలలో ఉంది అనుకున్నాడు. కాని అతని ఆరాటం రోజు రోజుకీ పెరుగుతున్నది. ఆమె కష్టాలేమిటో తెలుసుకోవాలన్న తాపత్రయం రోజు రోజుకీ ఎక్కువ అవుతున్నది. ఒక్కొక్కప్పుడు తనకే అనిపించింది ఆమె కష్టాలను గురించి తను ఆలోచించటం హాస్యాస్పదమని. ఆమెకు పెళ్ళయింది, ఒక పాప, పైగా తనకంటె పెద్దది. తల్లి తండ్రి ఉన్నారు. తనెందుకు ఆమె బాధలను గురించి వ్యథచెందాలి అనుకునేవాడు. కాని మనస్సును అదుపులో ఉంచుకోలేకపోతున్నాడు. మనస్సు పరిపరి విధాలపోతున్నది. ఆమెకు నిజంగా ఏ కష్టాలలేవేమో, తనే భ్రమపడుతున్నానేమో అనిపించేది కొద్దిసేపు. ఒకవేళ నిజంగా ఆమె ఇక్కట్లలో ఉన్నా తను ఏం చేయగలనని సర్దుకొనేవాడు. ఏమయినా ఈ ఆలోచన అతన్ని వెంటాడుతూనే ఉంది. దాని నుంచి మనస్సును మరల్చటం అతనికి చేతకావటం లేదు. రోజులు గడిచినకొద్దీ ఈ వేదన తీవ్రమవుతున్నది. ఇదే ధ్యాసలో రాత్రిళ్ళు నిద్ర కూడ పట్టేదికాదు. ఆమె ఏమనుకున్నా గాని, అసలు విషయం తెలుసుకోవాలని నిశ్చయించుకున్నాడు.

ఆ ఉద్దేశంతోనే మర్నాడు ఆమె ఇంటికి వెళ్ళాడు. ఇంట్లో ఆమె ఒక్కతే ఉంది.

"ఏమండీ ! మీరు ఏదో విపరీతమయిన మనోవ్యథ చెందుతున్నారు—ఎందుకో చెప్పరా?" అని అడిగాడు.

"నేనేం బాధపడటం లేదు, మామూలుగానే ఉన్నాను. అయినా మీ కా అనుమానం ఎందుకు వచ్చింది" అని ఎదురు ప్రశ్న అడిగింది. భర్తను గురించి అడిగినప్పుడు ఆమె మూగగా పడ్డ బాధను తను గ్రహించానని, అసలు సంగతి తెలుసుకోవాలని తను ఎంత సంఘర్షణపడ్డది, ఇప్పుడది తనకు భరింపరాని ఆవేదనగా తయారయిందని అన్నాడు. అతని మాటలు వినగానే ఆమె వలవల ఏడ్చింది. ఎంత బతిమాలినా ఆమె ఏడుపు ఆపలేదు. ఎప్పుడూ గంభీరంగా ఉండే ఆమె మరీ అంత బేలగా ఏడుస్తుంటే ఎలా సముదాయించాలో అతనికి తెలియలేదు. మౌనంగా ఆమెవైపే చూస్తూ కూర్చున్నాడు. కొంతసేపటికి ఆమె తేరుకున్నది.

'మీరు చాలా ధైర్యస్థులనుకున్నాను. మరీ అంత బేలతనం పనికిరాదు'' అన్నాడు ఆరిందలాగ.

"నన్ను గురించి ఆలోచించి, నా బాధలను చూసి వ్యథ చెందేవారున్నారని తెలిసి దుఃఖం ఆగలేదు" అంది సజలనయనాలతో.

## ఏకాంతం గుండెల్లో ...

కర్టెన్ కుచ్చిళ్ళను
మీటుతూ గాలి
కిటికీ జాలీల గుండా వీచే గాలికి
ఒంటి నిండా చిల్లులు.
మడచిన దుప్పట్ల నుంచి
కలల సుగంధాల ఆవిరులు
'మోడా'ను చూసినప్పుడల్లా
ఆమె నడుం వొంపులు గుర్తుకొస్తాయి.
పుస్తకాల
పేజీల రెప్పల రెపరెపలు !
అక్షరాల కన్నీళ్ళు !!
వెన్నెముక చుట్టూ అల్లుకున్న
బేగం అక్తర్ పాడిన
రాగాల తీగెలు
అట్లాగే
బలిసిన బల్లి నోట్లో
రెక్కల పురుగు
చివరి టపటపలు
అంతే !
ఏకాంతం గుండెల్లో
ఏటవాలు బాకు !!

- ఎస్ గోపి

"ఇప్పటికయినా మీ విషయం చెప్పరా" అని ప్రాధేయపూర్వకంగా అడిగాడు.

"తప్పక చెపుతాను. నాకోసం మీరు అంత ఆవేదనపడుతుంటే, మీకుగాక ఇంకెవరికి చెపుతాను" అని తన కథ ప్రారంభించింది.

"మాది సంపన్న కుటుంబం. మా వాళ్ళకు నే నొక్కతనే కూతుర్ని. అల్లారుముద్దుగా పెంచారు. చదువు చెప్పించారు. పెద్దదాన్నయ్యాను — పెళ్ళి ప్రయత్నాలు ప్రారంభించారు. అన్నివిధాల మాకు తగ్గ సంబంధం కొరకు చాలా ప్రయత్నాలు జరిగాయి. చివరకు ఈ సంబంధం స్థిరపరిచారు. మా వాళ్ళు ఎంతో సంబరపడ్డారు. నేనూ ఎంతో సంతోషించాను. తీపి కలలతో బంగారు భవిష్యత్తు వూహించుకొన్నాను. పెళ్ళి వైభవంగా జరిగింది. అన్ని వేడుకలతో కాపురానికి పంపించారు. మధుర భావాలతో, ఎన్నో ఆశలతో కాపురానికి వెళ్ళాను. దాంతో నా కష్టాలు ప్రారంభమయ్యాయి. నా కలలన్నీ కల్లలయ్యాయి. నా భర్త గోముఖవ్యాఘ్రమని తెలిసింది. నా డబ్బును, ఆస్తిని చూసి నన్ను చేసుకున్నాడే తప్ప, నేనొక మనిషినని, నాకో హృదయం ఉంటుందని ఎప్పుడు భావించలేదు. డబ్బు గుంజడమే ప్రధానం. పోనీ 'డబ్బు ఇస్తేనా సుఖం ఉండదా' అంటే అదీ లేదు. అనేక బాధలు పెట్టేవాడు. నిష్కారణంగా తిట్టడం, కొట్టడం జరిగేది. నే నేమయినాసరే, నా ఆస్తి అంతా చేజిక్కించుకోవాలని అతని సన్నాహం. వాళ్ళ పెద్దవాళ్ళు కూడ దానికి ప్రోత్సాహమిచ్చేవాళ్ళు.


అతడు మారతాడేమోనని వోపిక పట్టాను. అలానే కాపురం చేశాను. పాప పుట్టింది. అప్పుడైనా మారుతాడేమోనని ఆశించాను. అతనిని మార్చాలని చేసిన ప్రయత్నాలన్నీ వ్యర్థమయ్యాయి. అతని ప్రకృతే నాకు అంతుబట్టలేదు. రోజులు గడిచిన కొద్దీ మరీ క్రూరంగా తయారయ్యాడు. అతనిలో మార్పు వస్తుందన్న ఆశ వదులుకున్నాను. జీవితం మీద రోత పుట్టింది. పాప పుట్టకుండా ఉంటే నేనేమయ్యేదానినో? ఆ బంధమే నన్ను బతికించింది. క్రమంగా నాలో నిరాశ తగ్గింది. పట్టుదల పెరిగింది. నా జీవితాన్ని నేనే సరిదిద్దుకోవాలనే సంకల్పం దృఢంగా ఏర్పడ్డది. దీని కోసమయినా పరిష్కారమార్గం ఆలోచించాలని నిశ్చయించుకున్నాను.

అహర్నిశలు ఇదే ధ్యాస—నా సంపదే అతని దుష్ప్రవర్తనను ఎక్కువ చేసిందేమోనని అనిపించేది. అతను నా ఆస్తి మీద ఆధారపడి ఉన్నాడు గాని నేను అతనిమీద ఆధారపడి ఉండలేను. అయినా నామీద ఏమి దాష్టీకం. ఎందుకు నేనీ దారుణ హింస సహించటం? అన్న ప్రశ్న నాలో ఉద్భవించింది. ఆ ప్రశ్నే నా ఆలోచనలను కొత్త పుంతలకు మళ్ళించింది. ఎంత ఆలోచించినా ఒకటే మార్గం కనిపించింది. అతనితో తెగతెంపులు చేసుకోటం. అప్పుడు మా వాళ్ళకు అన్ని విషయాలు చెప్పి, నా నిర్ణయం కూడా తెలియచేశాను. వేరే మార్గం లేదు కనుక వాళ్ళు ఒప్పుకున్నారు. అందుకే విడిగా మా అమ్మ నాన్నలతో ఉంటున్నా, విడాకుల ప్రయత్నాలు జరుగుతున్నాయి" అని భారంగా తన విషాద గాథను చెప్పింది.

సురేష్ ఉద్రిక్తుడయినాడు. పట్టరాని కోపం వచ్చింది. 'ఆ స్కౌండ్రల్‌ను ఏమిచేసినా పాపంలేదు. అంతకంటె క్రూరంగా వాణ్ణి హింసిస్తే గాని నా కోపం చల్లారదు' అని ఆవేశంలో అరిచాడు. అనవసరంగా ఆవేశపడవద్దని వారించింది రేఖ.

'మీరేం భయపడకండి: జీవితాంతం మీకు అండగా నేనుంటాను—నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటాను'' అని గంభీరంగా అన్నాడు.

ఈ హఠాత్ పరిణామానికి రేఖ దిగ్భ్రాంతి



పైనపడి ....                                                  ఫోటో— ఎస్. మల్లేశ

చెందింది. ఇది ఎక్కడికి దారితీస్తుందోనన్న భయం ఏర్పడ్డది.

అతను తనకంటె చిన్నవాడు. చదువు పూర్తి కాలేదు. తను వివాహిత. ఒక పిల్ల తల్లి. లోకం ఏమనుకుంటుంది? అతని తల్లిదండ్రులు ఒప్పుకుంటారా? తన జీవితం ఎలాగూ చింపిన విస్తరయింది. అతనిని ఇందులోకి ఎందుకు దించాలి భావించింది. ఏ చీకూ చింతా లేకుండా మహారాజులాగా తిరగాల్సిన అతనికి తన వల్ల ఎన్ని కష్టాలొచ్చాయి అని వాపోయింది.

ఏదో ఆవేశంతో అతను అలా అన్నా, అతనిని అలాంటి ఆలోచనలు చెయ్యవద్దని కోరింది. దీనివల్ల వచ్చే అనర్థాలను గురించి పూస గుచ్చినట్లు అతనికి చెప్పింది. ఎంత చెప్పినా అతను తన ధోరణి మార్చుకోలేదు. లోకానికి తను వెరవనని ఖండితంగా చెప్పాడు. తల్లిదండ్రులను ఒప్పించే పూచీ నాదని మంకుపట్టు పట్టాడు. ఇప్పుడే వెళ్ళి పెద్దవాళ్ళను ఒప్పిస్తానని బయలుదేరాడు. అతి కష్టం మీద ఆ ప్రయత్నంనుంచి విరమింప చేసింది.

అప్పటి నుంచి రోజూ రేఖ వాళ్ళ ఇంట్లోనే ఎక్కువసేపు ఉంటున్నాడు. ఇంటికి ఎప్పుడో ఒక తడవ వెళ్ళేవాడు. కొడుకులో వచ్చిన మార్పును తల్లిదండ్రులు గ్రహించారు. కారణం అడిగితే ఏదో దాటేస్తున్నాడు. వాళ్ళు ఏదో చెయ్యాలనుకున్నా అసలు సంగతి తెలీకుండా ఏమి చేస్తారు? పోనీ కట్టడి చేద్దామంటే, చిన్నప్పటి నుంచి కొడుకుని కోప్పడటం గాని, ఆదేశించటంగాని వాళ్ళకు అలవాటు లేదు. ఏవన్నా వ్యసనాలకు లోనయి ఇలా తయారయ్యాడా అంటే, అలాంటి దాఖలాలు ఏమీ కనిపించటంలేదు. మనసులో బాధపడటం తప్ప వాళ్ళు ఏమీ చేయలేకపోయారు.

రేఖ, భర్తకు విడాకులిచ్చిం తర్వాత మనసులోని మాట తల్లిదండ్రులకు చెప్పాలని అతని సంకల్పం. అంతవరకు ఈ విషయాన్ని గోప్యంగానే ఉంచతలిచాడు.

అతని సమక్షంలో రేఖ అన్ని కష్టాలను మరచిపోయి, ఎంతో ఉల్లాసంగా ఉండేది. అతనితో మాట్లాడుతుంటే రోజులు క్షణాలుగా గడుస్తున్నాయి. క్రమంగా, తన పూర్వ స్మృతులను మరిచిపో సాగింది. ఏనాటి అనుబంధమో తమని దగ్గర చేసిం దనుకుంది. లేకపోతే ఈ కొద్ది సమయంలో వాళ్ళ మనసులు అంత చేరువవటం వూహాకందని విషయంగా కనిపించింది.

మధ్య మధ్య సురేష్ పెళ్ళి ప్రస్తావన తీసుకువచ్చే వాడు. కాదని అనటానికి ఆమె నోరు రాలేదు. ఆ సంగతి తలుచుకుంటే తనకు తలకరింపుగా ఉంది. జీవితంలో నవ వసంతాలు చిందుతున్నట్లు మురిసిపోయింది. తన మనువునే అతను అంగీకారంగా తీసుకున్నాడని గ్రహించి పరవశించింది. రోజులు త్వరగా గడిచి, ఆ కోర్టు వ్యవహారం తేలితే సరిపోతుందన్న ఆరాటం ఎక్కువయింది. గతంలో కూతురు పడ్డ కష్టాలు తలుచుకుంటే, ఆమె తల్లి తండ్రుల కడుపు తరుక్కుపోయేది. ఏదో సురేష్ సాహచర్యంలో ఆమె మామూలు మనిషి అయిందని సంతోషించారు. ఈ పెళ్ళి సంగతి వాళ్ళకు చెప్పినప్పుడు, కూతురు సుఖపడితే చాలని వాళ్ళు ఏమీ అభ్యంతరం చెప్పలేదు. కాని అతని తల్లిదండ్రులు ఒప్పుకుంటారాలేదా అన్న అనుమానం పీకుతున్నది. ఈ విషయం సురేష్ వాళ్ళతో మాట్లాడితే గాని, తాము వాళ్ళని కదల్చటం మంచిది కాదని సమయంకోసం వేచి ఉన్నారు. ఆ తల్లిదండ్రులు అతని మాటలు కాదన రన్న భరోసా కూడా ఏర్పడ్డది. అతని దృఢ నిశ్చయం, దాన్ని ఇంకా బలపరచింది.

ఆ రోజు దగ్గరవుతున్న కొద్దీ సురేష్ తీవ్రంగా ఆలోచించసాగాడు. ఎలా చెప్పి పెద్దవాళ్ళను ఒప్పించాలా అన్నదే తప్ప వేరేమీ ఆలోచించటం లేదు. అనేక రకాల వూహాలు చేస్తున్నాడు, మధ్య మధ్య రేఖను కూడా సంప్రదిస్తున్నాడు. రోజులు ఎలా గడిచిపోతున్నదో వాళ్ళకు తెలియదు.

ఒక రోజు అర్ధరాత్రి సురేష్ స్కూటరు ప్రమాదంలో మరణించాడన్న వార్త విని అతని తల్లిదండ్రులు కుప్ప కూలిపోయారు. రేఖ ఆ వార్త విని అచేతనంగా పడిపోయింది. కూతురి జీవితంలో అన్నీ అపశ్రుతులే పలుకుతున్నాయని ఆమె తల్లితండ్రులు కుమిలి, కుమిలి ఏడుస్తున్నారు.

స్పృహ వచ్చిన తరవాత ఇది నిజమా కలా అన్న భ్రమ కలిగింది. కసి కొద్దీ ఎవరో చేయించిన ఘాతుకం తప్ప ఇది దైవికంగా జరిగిన ప్రమాదం కాదని ఆమె మనస్సు ఘోషించింది. మనుషులలో ఇంత రాక్షసత్వం ఉంటుందని ఆమె వూహించలేకపోయింది. మనసులేని వాళ్ళతో బ్రతకలేక తను దూరంగా వచ్చింది. మనస్సున్న వాళ్ళు తనకు దగ్గరవుతే కూడ దక్క నియ్యరని ఏమాత్రం తెలిసినా ఆ అమాయకుణ్ణి వాళ్ళ క్రూరత్వానికి ఆహుతిచేసే దాన్ని కాదని విలపించింది. *